క్లుప్తంగా

పేదలకు వైద్యం అందించడమే లక్ష్యం



ఉచిత వైద్య శిబిరం ప్రారంభించిన గ్లోబల్ ట్రస్ట్ నిర్వాహకురాలు శిల్ప

పెనుకొండ: పేదలకు ఉచిత వైద్య సేవలు అందించడమే షిర్డీ సాయి గ్లోబల్ ట్రస్టు లక్ష్యమని నిర్వాహకురాలు శిల్ప అన్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం ఉచిత వైద్య శిబిరం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కన్ను, ముక్కు, చెవి, చర్మవ్యాధులకు విదేశీ వైద్యులు వైద్య చికిత్సలు అందించారు. ముందుగా ఆమె సాయికాశేశ్వర్ చిత్రపటం, వినాయకుని విగ్రహానికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మూడు నెలలకు ఒకసారి ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, బాధితులకు మందులు, పరికరాలు అందజేస్తామన్నారు. కంటి ఆపరేషన్లు సైతం నిర్వహిస్తామన్నారు. ఈ నెల 6 వరకూ వైద్య శిబిరం కొనసాగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు భాస్కరరెడ్డి, నాగిరెడ్డి, హరి, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

వారపు సంత వేలం పాట



వేలం పాట నిర్వహిస్తున్న కార్యదర్శి నరేష్

అమరాపురం: మండలంలోని హేమావతి సచివాలయంలో సర్పంచ్ తిప్పేస్వామి ఆధ్వర్యంలో వారపు సంత, ఉత్సవాల పార్కింగ్‌కు వేలం పాట నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన నరసింహరాజు పార్కింగ్‌ను రూ.60,500, వారపు సంతను రూ.35,600లకు శివకుమార్ దక్కించుకున్నట్లు కార్యదర్శి నరేష్ తెలిపారు. ఉత్సవాలు జరిగే సమయంలో పార్కింగ్ రుసుము వసూల హక్కులను నరసింహరాజుకు దక్కించుకున్నట్లు పేర్కొన్నారు.

నేడు మంత్రి పర్యటన


రొద్దం: మండలంలోని సానిపల్లి, చోళేమర్రి, పెద్దమంతూరు, చిన్నమంతూరు, చెరుకూరు, నల్లూరు, కలిపి గ్రామ పంచాయతీల్లో నేడు ఆదివారం స్త్రీ శిశు శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ పర్యటించనున్నట్లు ఎంపీపీ చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8:30 గంటలకు సానిపల్లి ఆశ్రమం వద్ద సమావేశం ఉంటుందన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు.

చిన్న పిల్లలకు ప్రత్యేక అంబులెన్స్



మడకశిరరూరల్: ప్రభుత్వం చిన్న పిల్లలకు అత్యవస వైద్య చికిత్సల నిమిత్తం 108 వాహనం తరహాలో శ్రీసత్యసాయి జిల్లాకు ప్రత్యేక అంబులెన్స్ (నియోనాటల్) వాహనం అందుబాటులో ఉంచిందని 108 డీఎం సంజీవరెడ్డి, డివిజన్ సూపర్‌వైజర్ రవీంద్ర శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వాహనం హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రిలో ఉంటుందని పేర్కొన్నారు. నెల రోజుల్లోపు వయస్సు ఉన్న చిన్న పిల్లలకు అత్యవస చికిత్సల నిమిత్తం 108 తరహాలో వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. అత్యవసర సమయంలో ఈ వాహనాన్ని వినియోగించుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు.

8 నుంచి సిద్ధేశ్వర స్వామి ఉత్సవాలు



ఉత్సవాల ఏర్పాట్లపై సిబ్బందితో చర్చిస్తున్న సీఐ రాజకుమార్

అమరాపురం: మండలంలోని హేమావతిలో ఈనెల 8వ తేదీ నుంచి సిద్ధేశ్వర స్వామి ఉత్సవాలు జరగనున్నాయి. శనివారం ఆలయ కమిటీ చైర్మన్ గోవిందరాయ, మడకశిర సీఐ రాజకుమార్, ఎస్‌ఐ జనార్దన్ నాయుడు పోలీసు సిబ్బందితో కలిసి ఉత్సవాల ఏర్పాట్లపై చర్చించారు. బారికేడ్ల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. వారం రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచే కాక సమీప కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తారని ఆలయ కమిటీ చైర్మన్ గోవిందరాయ తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బందోబస్తు ఏర్పాట్లు చేస్తామన్నారు. అనంతరం దేవాలయంలో స్వామికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ అర్చకులు సీఐ, ఎస్‌ఐలకు ఆలయ విశేషాలను వివరించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రామంజనేయులు పాల్గొన్నారు.

ప్రజారంజక పాలనే వైఎస్సార్‌సీపీ ధ్యేయం



మరువపల్లిలో పర్యటిస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్

పెనుకొండ రూరల్: ప్రజారంజక పాలన అందించడమే వైఎస్సార్‌సీపీ ధ్యేయమని మంత్రి ఉషశ్రీ చరణ్ అన్నారు. మండలంలోని కురుబవాండ్లపల్లి, మరువపల్లి, రాంపురం, కొండంపల్లి, హనుమప్పపల్లి గ్రామాల్లో ఆత్మీయ పలకరింపు కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముందుగా కురుబవాండ్లపల్లిలోని సచివాలయాన్ని మంత్రి సందర్శించారు. సచివాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. గ్రామంలో జరగిన అభివృద్ధి గురించి పంచాయతీ సెక్రటరీని అడగి తెలుసుకున్నారు,. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. సకాలంలో విధులకు హాజరై ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో పర్యటించారు. మంత్రి మాట్లాడుతూ ప్రజారంజక పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమన్నారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ప్రామాణికంగా. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ప్రతిపక్షాల హామీలు కేవలం ఎన్నికల మేనిఫెస్టోకే మాత్రమే పరిమితం అయ్యాయన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీరాములు, సర్పంచ్ నాగమూర్తి, వైస్ ఎంపీపీ రామాంజనేయులు, సింగిల్‌విండో అధ్యక్షుడు ప్రకాశ్ రెడ్డి, మండల కన్వీనర్ బాబు, నాయకులు రామ్మోహన్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నరసింహులు, కొండలరాయుడు, నారాయణ యాదవ్, వెంకటేష్, గోపాల్‌రెడ్డి, అంజి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను సీఎంగా ఆశీర్వదించండి



టీడీపీ నాయకులను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించిన వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ, మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప

● సమన్వయకర్త ఈరలక్కప్ప

గుడిబండ: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుంది. జగనన్నను మరోసారి సీఎంగా ఆశీర్వదించాలని మడకశిర సమన్వయకర్త ఈరలక్కప్ప ప్రజలను కోరారు. శనివారం మండల పరిధిలోని శంకరగల్లు, మైనగానపల్లి, జంబులబండ వివిధ గ్రామాల్లో హిందూపురం వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ, మడకశిర సమన్వయకర్త ఈరలక్కప్ప ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాజకీయాలు, కులమతాలకు తావు లేకుండా అన్నా వర్గాల ప్రజలకు సముచిత స్థానాలను కల్పించారని హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త బోయ శాంతమ్మ తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలబడి వారి ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలే లక్ష్యంగా పాటుపడిన జగన్నను వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ సీఎంగా చేసుకోవాలని సమన్వయకర్త ఈరలక్కప్ప కోరారు. పేదలకు మరింత మంచి జరగాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించాలని జెడ్పీటీసీ భూతరాజు పిలుపునిచ్చారు. వైఎస్ జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. నాయకులు, కార్యకర్తలు ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని పని చేయాలని రాష్ట్ర కార్యదర్శి జీబీ శివకుమార్ సూచించారు. కార్యక్రమంలో వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్లు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడ్, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

గుడిబండ: మండల పరిధిలోని జంబులబండ, నాగేపల్లి గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ, మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప వీరికి పార్టీ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానించారు. జంబులబండ, నాగేపల్లికి చెందిన హరీష్, రాజు, శ్రీనివాసులు, శివకుమార్ ఆధ్వర్యంలో దాదాపు 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలోకి చేరాయి. జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరామని వారు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భూతరాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పి.రొప్పాల వద్ద పోలింగ్ బూత్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అపూర్వ భరత్

రొద్దం: మండలంలోని వైటీరెడ్డిపల్లి, పి.రొప్పాల గ్రామాల్లో పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసే కేంద్రాలను సబ్‌కలెక్టర్ అపూర్వభరత్ శనివారం పరిశీలించారు. కేంద్రాల్లో మౌలిక వసతులు సక్రమంగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్, ఎస్‌ఐ వలీబాషా, ఆర్‌ఐ, వీర్‌ఓలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రొళ్ల: మండల పరిధిలోని దాసప్పపాళ్యం, దొడ్డేరి, 121, 122, 130 పోలింగ్ కేంద్రాలను సెక్టర్ ఆఫీసర్ శ్రీధర్ తనిఖీ చేశారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో కిటికీలు, వాకిళ్లు, వెలుతురు, విద్యుత్, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల ఇతరాత్ర సౌకర్యాలపై ఆరా తీశారు. పోలింగ్ కేంద్రాల్లో చిన్నచిన్న సమస్యలు ఏమైన ఉంటే ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు సరి చేయించాలన్నారు. మనబడి నాడు-నేడు ద్వారా నిర్మాణ దశలో ఉన్న పాఠశాలలను పూర్తి చేయించాలన్నారు.

ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష

మడకశిర: మండలంలో పెనుకొండ డీఎస్పీ బాజిజాన్ సైదా శనివారం పర్యటించారు. కదిరేపల్లి తదతర గ్రామాల్లో ఎన్నికల ఏర్పాట్లపై ఆరా తీశారు. స్థానిక సీఐ కార్యాలయంలో పోలీసులతో సమావేశమయ్యారు. ఎన్నికల విధులకు వచ్చే పోలీసులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంపై చర్చించారు. నియోజకవర్గంలో ఏర్పాటు చేసే చెక్ పోస్టుల వివరాలను తెలుసుకున్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో మడకశిర రూరల్ సీఐ రాజ్‌కుమార్, మడకశిర అప్‌గ్రేటెడ్ పీఎస్ సీఐ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

92 శాతం పింఛన్ల పంపిణీ



గుణేపల్లిలో పింఛన్ ఇస్తున్న వలంటీర్ జగదీష్

అమరాపురం: మండలంలో రెండో రోజు శనివారం పింఛన్ల పంపిణీ కొనసాగింది. మండలంలోని 15 గ్రామ సచివాలయాల పరిధిలోని ఇప్పటి వరకూ 92 శాతం పింఛన్లను లబ్ధిదారులకు అందించినట్లు ఎంపీడీఓ మునిస్వామి తెలిపారు. మిగతా పింఛన్లను రెండు రోజుల్లో పంపిణీ చేస్తామని తెలిపారు. వలంటీర్లు వారికి కేటాయించిన కుటుంబాల వద్దకు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేస్తున్నారన్నారు.

సత్యసాయి బాబాపై సూర్య కిరణాలు



మడకశిరరూరల్: మండల పరిధిలోని తులసీ ధామ వృద్ధాశ్రమంలోని సత్యసాయి దివ్య మందిరంలోని సత్యసాయి బాబా విగ్రహంపై శనివారం ఉదయం సూర్యకిరణాలు పడ్డాయి. ఈ దృశ్యాన్ని ఆశ్రమ నిర్వహకుడు తిమ్మప్ప చిత్రీకరించారు. భక్తులు, వృద్ధులు సాయిబాబాను దర్శించుకుని పూజలు నిర్వహించారు. మందిరంలో సాయిబాబాకు నిత్య పూజలతో నైవేద్యం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



సుహేబ్‌ను పరామర్శిస్తున్న గుడ్డంపల్లి వేణురెడ్డి, నాయకులు

హిందూపురం: ప్రభుత్వ భూమిని కబ్జాచేయడంతో పాటు ప్రశ్నించిన వారిపై దాడిచేసిన కోటా ఏరియా టీడీపీ నాయకులపై చర్యలు కఠిన తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి డిమాండ్ చేశారు. భూమి కబ్జా విషయంలో పట్టణంలోని కోట ఏరియాకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సుహేబ్‌పై ఇటీవల టీడీపీ నాయకులు దాడి చేశారు. శనివారం ఆయన సుహేబ్ ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈసందర్భంగా వేణురెడ్డి మాట్లాడుతూ హిందూపురంలో టీడీపీ నాయకులు మరుగుదొడ్లకు కేటాయించిన భూమి కబ్జా చేశారన్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేస్తే తమ కార్యకర్తపై దాడి చేయడం దారుణమన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కోటిపి హనుమంతరెడ్డి, ఏబ్లాక్ పట్టణ కన్వీనర్ మన్సూర్, నక్కలపల్లి శ్రీరాంరెడ్డి, నాయకులు రామ్మూర్తి, చాంద్ బాషా, పట్టణ మైనార్టీ కన్వీనర్ అయాబ్ భేగ్, రహంతుల్లా, షాజహాన్, సలీం, నూరుల్లా, షమీముల్లా జావిద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



హులికుంటలో కేక్ కట్ చేస్తున్న మహిళలు

రొళ్ల: సమాజంలో పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆర్డీటీ ఏటీఎల్ ఓబుశేష్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని అగ్రహారం, హులికుంట గ్రామాల్లో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఆర్డీటీతో పాటు ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. ఆర్డీటీ ద్వారా నిరుపేదలను గుర్తించి సహాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో మహిళ పోలీస్ శాంతమ్మ, హెచ్‌ఎం మారుతిప్రసాద్ పాల్గొన్నారు.

పాత సంత మైదానంలో కేఎస్‌ఆర్టీసీ బస్టాండ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ: పట్టణంలోని శిరా రోడ్డులో ఉన్న పాత సంత మైదానంలో ప్రత్యేకంగా కేఎస్‌ఆర్టీసీ బస్టాండ్‌ను త్వరలో నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ తెలిపారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మున్సిపల్ బస్టాండ్‌లో ప్రైవేటు, ఆర్టీసీ బస్సులు గతంలో కేవలం 30 మాత్రమే ఉండేవన్నారు. ప్రస్తుతం సుమారు 300 బస్సులకు పైగా ఉండటంతో స్థలం చాలడం లేదన్నారు. దీంతో మున్సిపల్ కౌన్సిలర్ల ఏకాభిప్రాయం మేరకు కేఎస్‌ఆర్టీసీ బస్టాండ్‌ను ప్రత్యేకంగా పాత సంత మైదానంలో నిర్మించేలా చర్యలు చేపడతామన్నారు. అంత కంటే ముఖ్యంగా పావగడలో నెల కొన్న కరవు కాటకాల దృష్ట్యా ఫుట్‌పాత్ వ్యాపారుల నుంచి తాత్కాలికంగా ఎలాంటి సుంకం వసూలు చేయకూడదని మున్సిపల్ అధికారులకు సూచించారు. ఈ నిర్ణయానికి కౌన్సిలర్లు ముక్త కంఠంతో సమ్మతించడం విశేషం. అయితే సుంకం నిలుపుదలతో మున్సిపాలిటీకి సుమారు రూ.30 లక్షల వరకు నష్టం వాటిల్లుతుందని అంచనా. మున్సిపల్ అధికారులు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని కౌన్సిలర్లు తెలిపారు. ప్రజలకు అందుబాటులో లేకపోవడంతో పనుల్లో జాప్యం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఏసీ గోటూరు శివప్ప, ముఖ్యాధికారి షంషుద్దా, కౌన్సిలర్లు రాజేశ్, సుదేశ్ బాబు, బాల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియో విజయవంతం చేద్దాం



అమరాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



గోరంట్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అమరాపురం: మండలంలోని హేమావతి, అమరాపురం పీహెచ్‌సీ పరిధిలో 0–5 సంవత్సరాల్లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని అమరాపురం, హేమావతి పీహెచ్‌సీ డాక్టర్లు అంబరీష్, భార్గవ్ కోరారు. శనివారం హేమావతి, అమరాపురంలో ఆరోగ్య సిబ్బంది పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పోలియో మహమ్మారిని తరిమి వేయడానికి ఈ మందు పని చేస్తుందన్నారు. మండలంలో మొత్తం 6543 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

పల్స్‌పోలియోపై అవగాహన ర్యాలీ

గోరంట్ల: పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శనివారం డాక్టర్ శృతి ఆధ్వర్యంలో గోరంట్ల పట్టణంలో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి నుంచి బస్టాండ్ సర్కిల్ వరకూ వైద్యాసిబ్బంది ర్యాలీ నిర్వహించి , బస్టాండ్ సర్కిల్ లో మానవహారం నిర్వహించారు. ఆదివారం నుంచి మూడు రోజుల పాటు ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేస్తామన్నారు. కార్యక్రమంలో హెల్త్ సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గుడిబండ: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో పల్స్ పోలియోపై అవగాహన కల్పించారు. పాఠశాల విద్యార్థులతో కలిసి వైద్య సిబ్బంది ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో డాక్టర్లు వెంగళరావు, భారతి, ఆశావర్కర్స్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు: నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు అని వైద్యాధికారి డా.రామకృష్ణ అన్నారు. ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం ఉండటంతో శనివారం మండల కేంద్రంలో వైద్య సిబ్బంది అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చిలమత్తూరు బస్టాండ్ వద్ద మానవహారంగా ఏర్పడి ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే పేదల సంక్షేమం



గుమ్మయ్యగారిపల్లిలో మాట్లాడుతున్న చరణ్‌రెడ్డి

గోరంట్ల: వైఎస్సార్‌సీపీతోనే పేదల సంక్షేమం కోసం సాధ్యమని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని మంత్రి ఉషశ్రీ భర్త చరణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుమ్మయ్యగారిపల్లి, విజయనగర్ కాలనీలో శనివారం సర్పంచ్ సరోజ బాయి నేతృత్వంలో పార్టీ శ్రేణులతో కలసి ఆయన ఆత్మీయ పలకరింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ శ్రేణులతో కలసి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, త్వరలో జరగబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించాలని ప్రజలను కోరారు. మోసపూరిత హామీలతో చంద్రబాబు మరోసారి ప్రజల ముందుకు వస్తున్నారన్నారు. వాటిని ప్రజలు తిప్పికొట్టి, పేదలకు మంచి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలేజయరాంనాయక్, పార్టీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఫక్రుద్దీన్‌సాహెబ్, జిల్లాపరిషత్ కోఆప్షన్ సభ్యుడు డాక్టర్ భాషా, మండల ఉపాధ్యక్షులు నాగభూషణరెడ్డి, స్థానిక నాయకులు మల్లికార్జునరెడ్డి, రఘునాథరెడ్డి, నారాయణరెడ్డి, కురుబ వెంకటేశు, రమేష్, విక్రమసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


తలసీమియా బాధితుడికి పింఛన్ మంజూరు



అఖిల్‌కు రూ.10 వేల పింఛన్ అందిస్తున్న కౌన్సిలర్ సుభద్ర

మడకశిర: తలసీమియాతో బాధపడుతున్న ఓ బాలుడికి ప్రభుత్వం రూ.10 వేల పింఛన్ మంజూరు చేసింది. వివరాలు.. పట్టణంలోని 17వ వార్డు పాత ఎస్సీ కాలనీకి చెందిన హనుమంతరాయప్ప కుమారుడు అఖిల్ గత 6 సంవత్సరాలుగా తలసీమియాతో బాధపడుతున్నాడు. ఇటీవల గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా కాలనీలో ఎమ్మెల్యే తిప్పేస్వామి పర్యటించారు. ఆ సమయంలో బాలుడి తండ్రి హనుమంత రాయప్ప కుమారుడి కష్టాన్ని ఎమ్మెల్యేకు వివరించారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ సుభద్ర, వైద్యాధిరులకు ఎమ్మెల్యే సూచించారు. బాలుడికి వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు తలసీమియాతో బాధపడుతున్నట్లు సర్టిఫికెట్ మంజూరు చేశారు. అనంతరం సచివాలయంలో పింఛన్ కోసం దరఖాస్తు చేయించారు. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10 వేల పింఛన్‌ను శనివారం కౌన్సిలర్ సుభద్ర, వార్డు సచివాలయ అధికారులు అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నాగేంద్ర, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అన్నదాన సత్రం నిర్వహణకు విరాళం



కమిటీ సభ్యులకు విరాళం అందిస్తున్న దాత

లేపాక్షి: స్థానికి వీరభద్రస్వామి ఆలయ సమీపంలో నిర్మించిన అన్నదాన సత్రం నిర్వహణకు లేపాక్షికి చెందిన మఠం విశ్వనాథ్ రూ.25 వేలు విరాళం అందజేశారు. తన మనవడు జీవాన్స్ ఆరాధ్య పుట్టిన రోజును పురస్కరించుకుని విరాళం అందించినట్లు దాత తెలిపారు. ఈసందర్భంగా కమిటీ సభ్యులను దాతను శాలువాతో సత్కరించారు.

పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ

హిందూపురం: మున్సిపాల్టీ పరిధిలోని ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ అవకాశం కల్పించినట్లు కమిషనర్ శ్రీనాథ్‌రెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 31లోపు పన్ను చెల్లించిన వారికి మాఫీ వర్తిస్తుందని పేర్కొన్నారు.

నేత్రపర్వంగా వెండి పల్లకీ ఉత్సవం



వెండి పల్లకీలో ఊరేగుతున్న శనీశ్వరుడు

పావగడ: శాంత స్వరూపుడు శనిమహాత్ముడి ఆలయంలో ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం సాయంత్రం శనీశ్వరస్వామి వెండి అడ్డ పల్లకి ఉత్సవం నేత్రపర్వంగా సాగింది. ఈ సందర్భంగా జ్యేష్ఠాదేవి సమేత శనీశ్వరస్వామిని వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య నూతనంగా నిర్మించిన వెండి అడ్డ పల్లకీలో కొలువుదీర్చారు. అనంతరం వెండి పల్లకీని ప్రధాన రోడ్డులో ఊరేగించారు. దారి పొడవునా అధిక సంఖ్య భక్తులు రథోత్సవాన్ని కన్నులారా తిలకించారు. రథానికి టెంకాయలు కొట్టి పూజలు చేశారు.

క్రమశిక్షణతో చదువుకోండి

రొళ్ల: మండల పరిధిలోని బీజీ హళ్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం 9, 10వ తరగతి విద్యార్థులకు వృత్తి మార్గదర్శకంపై హెచ్‌ఎం యంజారప్ప అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువుతో పాటు వృత్తి మార్గదర్శంపై అవగాహన పెంచుకోవాలన్నారు. చెడు అలవాట్లకు బానిస కాకుండా క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు.

నేడు మెగా జాబ్‌మేళా

హిందూపురం: స్థానిక ఎస్‌డీజీఎస్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కాకినాడ శ్రీ పీఠం పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామిజీ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో మెగా జాబ్ మేళా ద్వారా 10 వేల మందికి ఉద్యోగ అవకాశాలు అందించబోతున్నమన్నారు. ఉదయం 9 గంటలకు రిజిస్ట్రేషన్ పక్రిమ ప్రారంభించి అభ్యర్థులకు 11 నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. బీజేపీ నాయకులు రమేష్‌రెడ్డి తదితరులుపాల్గొన్నారు.

సజావుగా ఇంటర్ పరీక్షలు

చిలమత్తూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్ సెకండియర్ పరీక్షలు పరీక్షలు సజావుగా జరిగాయి. మొత్తం 264 మందికిగాను 258 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు.

5న వైద్య శిబిరం

రొళ్ల: మండల పరిధిలోని గుడ్డగుర్కి సచివాలయ ఆవరణలో ఈనెల 5వ తేదిన ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకూ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాద్, సర్పంచ్ హరికృష్ణ శనివారం తెలిపారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ పూర్తి చేయండి

హిందూపురం అర్బన్: వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీని త్వరిత గతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి వెంకటరమణ పేర్కొన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎస్ఎంలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. జగనన్న ఇళ్లు నిర్మించుకుటున్న లబ్ధిదారులకు బిల్లులు సకాలంలో అందించాలని సూచించారు.